క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు టీఎస్‌ఎస్పీ బెటాలియన్ ప్రధాన గేటు సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం టీఎస్‌ఎస్పీ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ బాలాజీ విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీగా గురువారం ఉదయాన్నే బైక్‌పై విధులకు బయల్దేరాడు. ఈక్రమంలో టీఎస్‌ఎస్పీ బెటాలియన్ గేట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా బైక్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దాంతో అతని తలకు బలమైన గాయాలు కాగా, టీఎస్‌ఎస్పీ బెటాలియన్ సిబ్బంది హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఓసిటీ రోడ్డులో మరమ్మతులు



కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులో గుంతలతో ప్రజలు, కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి కొండా సురేఖ దృష్టికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు దాసరి రాజేష్ తీసుకెళ్లారు. దాంతో మంత్రి స్పందించి మరమ్మతులు నిర్వహించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు గుంతల్లో మట్టి పోసి గురువారం మరమ్మతులు చేశారు.

రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి



హసన్‌పర్తి: రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళీధర్‌రావు అన్నారు. రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పాడి గణపతిరెడ్డి గురువారం మురళీధర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీసులకు సహకరించాలి



హసన్‌పర్తి: శాంతిభద్రతల విషయంలో పోలీసులకు ప్రజలు, నాయకులు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ చేరాలు కోరారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చేరాలును పలు పార్టీలకు చెందిన నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవన్నపేట మాజీ సర్పంచ్ చుంచు రవి, రెడ్డి సంఘం మండల ప్రధాన కార్యదర్శి సూరం వాసుదేవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చుంచు విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసద్‌ను కలిసిన ప్రతినిధులు



న్యూశాయంపేట: ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గ్రేటర్ వరంగల్‌కు చెందిన పలు పార్టీల ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ బొక్కలగడ్డ వద్ద ఉన్న మసీదు విషయంలో చర్య తీసుకోవాలని వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కారానికి సత్వరమే స్పందించిన ఎంపీకి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ సుభాన్, ఫైజుల్లాఖాన్, నాయకులు అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీకి సన్మానం



మడికొండ: 50ఏళ్లుగా ఆర్‌ఎంపీగా మడికొండ గ్రామస్తులకు వైద్య సేవలందించిన టి.యాదగిరిని స్థానికులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో పెండ్లి కృష్ణమూర్తి, రుక్మేందర్ రెడ్డి, ఆకుల పాపయ్య, నారాయణ, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

జేబు దొంగ చేతివాటం

ఖిలా వరంగల్: మధ్యకోట ఖుష్‌మహల్ ప్రాంగణంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఓ జేబు దొంగ తన చేతివాటం ప్రదర్శించాడు. తన జేబులో నుంచి రూ.9వేలు నగదు అపహరించినట్లు కాంగ్రెస్ నేత గజ్జెల శ్యామ్ తెలిపారు. కాగా, చోరీ నిందితుడి వివరాలను మిల్స్‌కాలనీ పోలీసులు సేకరించినట్లు తెలిసింది.

త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ



కాంగ్రెస్ భవన్‌లో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ



'కుడా' కార్యాలయంలో చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, వీసీ అశ్విని తానాజీ వాకడే, సీపీఓ అజిత్ రెడ్డి



ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఎగువేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, సర్కారు కార్యాలయాలు, పార్టీ ఆఫీసులు, ఇతర చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు త్రివర్ణ పతాకాలను ఎగువేశారు.

– సాక్షి నెట్‌వర్క్



యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..



నయీంనగర్: ప్రెస్ క్లబ్‌లో..



వరంగల్: మార్కెట్‌లో..



త్రివర్ణ జెండాను ఆవిష్కరిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ)



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కమాండెంట్ బి.రామ్‌ప్రకాశ్, సిబ్బంది



కాజీపేట రైల్వే సీసీఎస్ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న రైల్వే నాయకులు



కాజీపేట మెప్మా కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ జక్కుల రవీందర్



కాశిబుగ్గ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద..



వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్‌ఎన్‌టీ రోడ్డులో..



జెండా ఆవిష్కరిస్తున్న జానపద గిరిజన విజ్ఞాన పీఠాధిపతి బాబురావు



జెండాతో చిన్నారులు



వరంగల్ జెడ్పీలో కలెక్టర్ సత్యశారద



బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో..



బీజేపీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో..



బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో..



వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులో..



మడికొండలోని దుర్గాబాయి మహిళా ప్రాంగణంలో మేనేజర్ జయశ్రీ, తదితరులు



పురావస్తుశాఖ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న అధికారులు, తదితరులు



అదాలత్ సెంటర్‌లో ఎన్‌సీసీ కేడెట్లతో కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్



సమరయోధుడు గురుమూర్తి శివలింగం భార్య శ్యామలాంబను సన్మానిస్తున్న ప్రొఫెసర్ సురభిభారతి

యాంటీ ర్యాగింగ్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో యాంటీ ర్యాగింగ్ వాల్‌పోస్టర్లను పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్లు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ హనుమంతు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య, కెమిస్ట్రీ విభాగం అధిపతి ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్, అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

కేయూ న్యూస్‌లెటర్ 'వివేచన' ఆవిష్కరణ



న్యూస్‌లెటర్ వివేచనను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రూపొందించిన 19వ వాల్యూమ్ రెండో ఇష్యూ న్యూస్ లెటర్ వివేచనను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్లు గురువారం ఆవిష్కరించారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఈ న్యూస్‌లెటర్ వివేచనను రూపొందిస్తున్నారు. కార్యక్రమంలో కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, ఇంగ్లిష్ విభాగం అధిపతి డాక్టర్ దీపాజ్యోతి, గణిత విభాగం అధిపతి భారవి శర్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పాల్గొన్నారు. కాగా, కేయూ ఎస్‌డీఎల్‌సీఈలో మిమిక్రీ కోర్సు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లను రిజిస్ట్రార్ మల్లారెడ్డి అందజేశారు.

బాలుడి అప్పగింత

రామన్నపేట: వరంగల్ నగరంలోని వేణుగోపాలస్వామి దేవస్థానం రోడ్డులో నివాసముండే పుల్లూరి దేవేందర్ కుమారుడు 12 ఏళ్ల శ్రీదత్త బుధవారం నుంచి కనిపించడం లేదనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి పేర్కొన్నారు. కాగా, ఆ బాలుడిని వరంగల్ ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. వారి నుంచి శ్రీదత్తను స్థానిక పోలీసులు తీసుకొచ్చి అతడి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



హన్మకొండ చౌరస్తా: మాట్లాడుతున్న రమేష్

హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ చౌరస్తాలో రాత్రి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జనజాగరణ సభ జరిగింది. రాత్రి 9గంటలకు ప్రారంభమైన సభ అర్ధరాత్రి వరకు కొనసాగింది. కళాకారులు ఆటపాటలతో సభా ప్రాంగణం మారుమోగింది. ఈ సభకు వాసుదేవ రెడ్డి, ఉప్పలయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రమేష్ మాట్లాడారు. గడిచిన 11 ఏళ్లలో ప్రజా సంపదను లూటీ చేస్తూ కార్పొరేట్ శక్తులకు కేంద్రం కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, పలు సంఘాల బాధ్యులు రాములు, దీప, వీరన్న, తిరుపతి, వెంకట్, పర్వతాలు, కుమారస్వామి, అశోక్, సంపత్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న యూనియన్ నేతలు

కార్మిక హక్కులను కాపాడుకుందాం..

ఖిలా వరంగల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక హక్కులను కాపాడుకుందామని ఆల్ ట్రేడ్ యూనియన్ నేత, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, నాయకులు కాసు మాధవి, పాశం రవి పిలునిచ్చారు. ఈమేరకు ఖిలా వరంగల్ మధ్యకోటలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో గురువారం జనజాగరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. శ్రీనివాస్, దయాకర్, యాదగిరి, జగదీశ్వర్, శ్యాంసుందర్, మాలోతు సాగర్, కందిక చెన్న కేశవులు, యాకూబ్, దండు లక్ష్మణ్, ప్రభాకర్, యాకూబ్ పాషా, జుబేదా, అప్పాజీ పాల్గొన్నారు.

సమైక్యతను కాపాడుకోవాలి

కాజీపేట రూరల్: భారతీయ సమైక్యతను కాపాడుకోవాలని, కులమతాలకు అతీతంగా ఉంటూ భారతీయ ఐక్యతను చాటాలని రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్‌కృష్ణసాయి, డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్ సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనల విజేతలకు కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవారంగంలో భారతీయ రైల్వే కీలకపాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన డీఎంఈ అనికేత్ ఖడ్గే, ఏడీఎంఈలు భానుప్రకాష్, నాగరాజశేఖర్, ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

రైతుల రుణం తీర్చుకున్న రేవంత్ సర్కారు

● టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు



రాహుల్ గాంధీ, రేవంత్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రవీందర్ రావు, తదితరులు

హన్మకొండ: దేశంలో ఎక్కడ లేనివిధంగా రుణమాఫీ చేసి తెలంగాణ రైతుల రుణం తీర్చుకున్న ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డిదే అని రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గురువారం మూడో విడతలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిన సందర్భంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటాలకు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, రైతులతో కలిసి పాల, పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో 2022 మే 6వ తేదీన రైతు సంఘర్షణ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తెలంగాణాలో అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రైతు డిక్లరేషన్ ప్రకటించిందని గుర్తు చేశారు. ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా నెంబర్లు, ఇతర వివరాలు సరిగా లేకపోవడం వంటి కారణాలతో కొంతమంది రైతులకు డబ్బులు జమ కాలేదని, ఎవరూ ఆందోళన చెందవద్దని వ్యవసాయ అధికారులతో సమీక్షించి అర్హులైన వారందరి రుణాలు మాఫీ చేస్తామన్నారు. వెంటనే కొత్త రుణాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సరస్వతినగర్, విజయనగర్ కాలనీ, మాధవనగర్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పూర్తిగా గాడితప్పిన విద్యా వ్యవస్థ

వరంగల్ చౌరస్తా: విద్యావ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి, ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున విమర్శించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం విద్య కాషాయీకరణ చేయడమే ముఖ్య అజెండాగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. విద్యా వ్యవస్థలో పలు మార్పులు చేర్పులు చేస్తూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన ఎందరో విప్లకారుల చరిత్రలను పాఠ్య పుస్తకాల్లో నుంచి పాలకులు తొలగించారని పేర్కొన్నారు. నీఫా –2020 ద్వారా బలవంతంగా మూఢనమ్మకాలను ప్రేరేపించే విధంగా



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. తద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోని బీజేపీ వ్యక్తిగత వాదమైన మనువాదం దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు వస్కుల మట్టయ్య, ఉపాధ్యక్షులు వస్కుల భరత్, పోతుగంటి కాశి, సభ్యులు జన్ను రమేష్, టింకటి కుమార్, గడ్డం శ్రీకాంత్, సందీప్ పాల్గొన్నారు.

రెగ్యులర్ వీసీలను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నయీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల ఖాళీల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, ఈక్రమంలో ప్రభుత్వం తక్షణమే యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ నయీంనగర్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ యూనివర్సిటీలను బలోపేతం చేయడం కోసమే ప్రభుత్వ యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో యూనివర్సిటీలు, విద్యారంగం గురించి పట్టించుకునే వారే కరువయ్యారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, మిశ్రిన్ సుల్తానా, రమేష్, గణేష్, సైదులు, సుమన్, ధరణి పాల్గొన్నారు.

కార్మికరంగ సమస్యల పరిష్కారానికి కృషి

హన్మకొండ: కార్మికరంగ సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తోందని ఐఏసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్ర ప్రతాప్ తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఏఐసీటీయూ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్మిక వర్గాన్ని ఏకంచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 3న జరగనున్న హనుమకొండ జిల్లా మహాసభకు కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్ర ప్రతాప్

సమావేశంలో ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి, ఏఐసీటీయూ హనుమకొండ జిల్లా కన్వీనర్ మొగిలి శ్రీనివాసరావు, నాయకులు చీపురు ఓదయ్య, ఇంద్రారెడ్డి, మంద భద్రయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



హన్మకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ) –327 ఎన్పీడీసీఎల్ యూనిట్ అధ్యక్షుడు పాకాల మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డికి యూనియన్ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ హనుమకొండ రూరల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఎం.శ్రీనివాస్, సుధాకర్, హనుమకొండ టౌన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరేందర్ రెడ్డి, ఉమేష్, జిల్లా నాయకుడు చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.